పాఠశాలకు ప్రహరీ కరువు

- నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోని వైనం
- అపరిశుభ్రంగా గోపరపల్లె ప్రభుత్వ పాఠశాల పరిసరాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ప్రహరీ లేని గోపరపల్లె పాఠశాల

ఓదెల: మండలంలోని గోపరపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు 50మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల చుట్టూ తాటి చెట్లు ఉంటాయి. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో కల్లు తాగడానికి వచ్చిన వారు తాగిపారేసిన ర్యాకెలు కొట్టుకువస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. చెత్తాచెదారం కొట్టుకువచ్చి పాఠశాల అపరిశుభ్రంగా మారుతోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైనా..

ఈ పాఠశాల సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే ప్రధాన రహదారికి పక్కన ఉండటంతో వాహనాల రద్దీతో విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారింది. రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేశారు. నిధులు ఉన్నప్పటికీ ప్రహరీ నిర్మించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

చదవలేకపోతున్నాం



పాఠశాల రహదారికి పక్కనే ఉండడంతో వాహనాల శబ్దాలతో చదవలేకపోతున్నాం. ప్రహరీ నిర్మిస్తే బాగుంటుంది. పాఠశాలకు సరిపడా స్థలంతో పాటు ప్రహరీ లేనందున చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– బోయిని అక్షర, ఏడో తరగతి, విద్యార్థి

చుట్టూ ప్రహరీ నిర్మించాలి



పెద్దపల్లి ఎమ్మెల్యే మంజూరు చేసిన నిధులతో పాఠశాలకు చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ప్రస్తుతం పాఠశాల చుట్టూ ప రిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తులు ప్రహరీ నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– బత్తుల వినీత్, పూర్వ విద్యార్థి, గోపరపల్లె

స్థలం కొనుగోలు చేయాలి

గోపరపల్లి పాఠశాల విద్యార్థులకు సరిపడా స్థలం కొనుగోలు చేయాలి. మంజూరైన నిధులతో ప్రస్తుతం ఉన్న స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించాలి. అదనంగా పాఠశాల ఎదుట స్థలాన్ని కొనుగోలు చేస్తే స్కూల్లో జరిగే కార్యక్రమాలకు అనుకూలంగా ఉంటుంది.

– దాసరి మహేందర్, ప్రధానోపాధ్యాయుడు, గోపరపల్లె

నిధుల మంజూరు విషయం నాదృష్టికి రాలేదు

గోపరపల్లె ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం నిధుల మంజూరు విషయం నాదృష్టికి రాలేదు. పాఠశాలకు చుట్టూ ప్రహరీ లేదన్న విషయం తెలుసు. సమాచారం తెలుసుకొని సమస్య పరిష్కరిస్తా.

– ఎర్ర రమేశ్, ఎంఈవో, ఓదెల

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: రోడ్డు విస్తరణ పనుల్లో మార్క్ అవుట్ ప్రకారంగా పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, రోడ్లు భవనాల శాఖ ఏఈ పాషా ఆదేశించారు. పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా రోడ్డు నుంచి శాంతినగర్ వరకు వెళ్లే రహదారి ఇరువైపులా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను వారు బుధవారం పరిశీలించారు. వ్యాపారులు సహకరించాలని వారు కోరారు. రోడ్డు విస్తరణ పనుల్లో కింది భాగం పైప్‌లైన్ ఉన్నందున పైప్‌లైన్‌కు ఇబ్బంది కలగకుండా లీకేజీలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి తిరుపతమ్మ, మేనేజర్ అలీమొద్దీన్, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టర్ కోటి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శైలజారాణి

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో బద్రి శైలజారాణి పరిశీలించారు. ప్రభుత్వం రత్నాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయగా 323 ఇళ్లు మంజూరయ్యాయి. సుమారు 50ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని వారు తెలిపారు. గ్రామానికి చెందిన కనవేన భాగ్య, జక్కుల రజిత, కండె రాజమణి ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగా వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం మిగతా లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్, రత్నాపూర్ కాంగ్రెస్ నాయకులు కండె పోచం, మోత్కురి అవినాశ్‌గౌడ్, మట్ట రాజ్‌కుమార్, కొప్పుల రాంచందర్, కొడారి సది, కెక్కర్ల స్వరూపగౌడ్, బోగె ప్రకాశ్, మారుకొండ సంతోష్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా గెలుపు బీజేపీదే



మాట్లాడుతున్న మహేందర్‌యాదవ్

సుల్తానాబాద్: ఎన్నికలు ఏవి వచ్చినా బీజేపీదే గెలుపు అని పార్టీ జిల్లా కార్యదర్శి సాదరి మహేందర్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో బుధవారం గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము తిరుపతియాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వేగోళం శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు లంక శంకర్, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్, ఎర్రం సంతోష్‌రెడ్డి, దొంగల శ్రీనివాసరెడ్డి, రాజిరెడ్డి, ఎల్లంకి రాజన్న, మల్క భాగ్యలక్ష్మి, ఎస్ఎస్ వనజ, మాటూరి లత, బుర్ర సతీశ్‌గౌడ్, భూసారపు సంపత్, ఇగురం రామస్వామి, ఎనగందుల సతీశ్, సట్టు శ్రీనివాస్, మనోహర్, నరేశ్, పెరిక రమేశ్, శంకర్, తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్‌గా అరవింద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని సీఐఎస్ఎఫ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

అపోహలు వీడండి నేత్రదానం చేయండి

కోల్‌సిటీ: ప్రతీఒక్కరు అపోహలు వీడి నేత్రదానం చేయాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు పిలుపునిచ్చారు. గోదావరిఖని ఫైవింక్లయిన్ ఏరియాలో ఇటీవల పయిరాల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా అతని నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ బుధవారం నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించింది. నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందజేశారు. కాంగ్రెస్ 33వ డివిజన్ అధ్యక్షుడు రాము, రాష్ట్ర రజక వ్యవస్థాపక అధ్యక్షుడు కనకయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు సతీశ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవం కన్వీనర్ గాదె రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జ్యోతిబసు, నాయకులు మాల్లారెడ్డి, గంగయ్య, సత్తిరెడ్డి, మల్లేశం, తిరుపతి, పర్శరాములు, సతీశ్, అంజయ్య, మనోహర్ ఉన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



వాల్ రైటింగ్ ప్రారంభిస్తున్న పుట్ట మధుకర్

పాలకుర్తి: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించే పార్టీ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ కోరారు. పాలకుర్తి మండలం కన్నాలలో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఖాదర్‌పాషా, గ్రామ మాజీ ఎంపీటీసీ అతిక్, పుప్పాల కృష్ణ, మధునయ్య, రాణాపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిషేధిత పురుగు మందులు వినియోగించొద్దు



ర్యాలీలో పాల్గొన్న రైతులు, ప్రతినిధులు

ముత్తారం: నిషేధిత పురుగుల మందులు వినియోగించొద్దని బీసీఐ క్షేత్ర పరిశీలకులు చెలుకల యుగేందర్, రాజశేఖర్ సూచించారు. మండలంలోని కేశనపల్లిలో బుధవారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురుగుల మందు పిచికారి చేసే సమయంలో రైతులు వాడాల్సిన దుస్తులు, జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.94వేలు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం హుండీ బుధవారం లెక్కించగా రూ.94,126 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కాంతరెడ్డి తెలిపారు. ఆలయం ఆవరణలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ దేవాదాయశాఖ పరిశీలకులు సత్యనారాయణ, దేవస్థానం ఈవో సమక్షంలో పాలక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వచ్చే నెలలో జరిగే జాతర ఉత్సవాల కోసం వివిధ రకాల దుకాణాల కోసం నిర్వహించిన టెండర్లకు సరైన కొటేషన్ రానందున ఈ నెల 18న టెండర్ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఏపీఏ కార్మికుడికి గాయాలు

రామగిరి: ఏపీఏ గనిలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు మద్ది బీరయ్య గాయాలపాలయ్యాడు. బుధవారం గని ఆవరణలో విధులు నిర్వహిస్తున్న సర్ఫేస్ కార్మికుడు బీరయ్య కొలిమి దగ్గర కోణికల్ వాచర్స్ అబ్లాంగ్ చేస్తుండగా విరిగి కాలికి గుచ్చుకుంది. వెంటనే సెంటినరికాలనీ డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

• తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని జంపయ్య అనే గీత కార్మికుడు బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడ్డాడు. గాయాలపాలైన జంపయ్యను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబీకుడైన జంపయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

• కమాన్‌పూర్ మండల కేంద్రంలో..

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన గర్రెపల్లి వెంకటేశ్‌గౌడ్ బుధవారం ఉదయం తాటిచెట్టుపై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం వెంకటేశ్ తాటి చెట్టు ఎక్కి కల్లు తీసుకొని కిందికి వస్తుండగా కాలుజారి కిందపడడంతో గాయాలయ్యాయి. తోటి గీత కార్మికుడు 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

• పెద్దాపూర్‌లో ఎడ్లబండి పోటీలు

జూలపల్లి: మండల పరిధిలోని పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద బుధవారం ఎడ్లబండి పోటీలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి మనోజ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కరీంనగర్‌లోని ఒమెగా హాస్పిటల్ నిర్వాహకులు అరుకొల్ల శ్రీనివాస్ పావుతులం బంగారం మెదటి విజేత దెబ్బెటి సాయి వెంకట్‌కు అందించగా, రెండో విజేత నేరేళ్ల నరేశ్‌గౌడ్‌కు తాళ్లపెల్లి మనోజ్‌గౌడ్ 10 తులాల వెండి, మూడో విజేత మాదాసు శంకరయ్యకు కొండపెల్లి కృష్ణమూర్తి 5తులాల వెండి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పోటీలకు వచ్చిన ఎడ్లబండి యజమానులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సంకెన్ల లక్ష్మన్ (కరాటే), ఉయ్యాల వెంకటేశ్, అరుకోల్ల శంకర్, పెసరు అనిల్, గుర్రం స్వామి, మూడపెల్లి స్వామి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

• నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతు పనుల కారణంగా గురువారం నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. పెద్దగుట్ట నుంచి వచ్చే పంపులు పనిచేయవని, ప్రజలు సహకరించాలన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శంకర్‌గంజ్, తిలక్‌నగర్, సాగర్‌రోడ్డు, మున్సిపల్ ఆఫీసు ఏరియా ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రోడ్ల మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

• అగ్రిటెక్ షాపు అందుబాటులోకి రావడం శుభ పరిణామం

కాల్వశ్రీరాంపూర్: అగ్రిటెక్ వ్యవసాయ సంబంధిత యంత్రాలు, పనిముట్ల షాపు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయడం రైతులకు శుభ పరిణామమని మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కాల్వశ్రీరాంపూర్ వీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం అగ్రిటెక్ వ్యవసాయ సంబంధిత యంత్రాలు, పనిముట్లు విక్రయించే షాపును వారు ప్రారంభించారు. మాజీ ప్రజా ప్రతినిధులు గూడెపు జనార్దన్‌రెడ్డి, జట్టి దేవయ్య, నాగార్జున్‌రావు, రవీందర్‌రెడ్డి, కరుణాకర్, లోనె శ్రీనివాస్, నాయకులు పిన్నిటి శ్యాం, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, గణపతిరెడ్డి, రంజిత్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో నాయకులు

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: స్థానిక లక్ష్మీనగర్‌లోని రీగల్ షూ మార్టు వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం జెండా ఆవిష్కరించి ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయకులు ఉదయ్‌రాజ్, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరిట మోసం

ఓదెల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు అన్నారు. ఓదెలలో బీజేపీ బుధవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ఆయనను పార్టీ నాయకులు సన్మానించారు. పార్టీ మండల ఇన్‌చార్జి దాత రాకేశ్‌పటేల్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, నాయకులు తూడి రాజేందర్, రాంనేని రాజేంద్రప్రసాద్, రాచర్ల అశోక్, పుల్ల సదయ్యగౌడ్, శ్రీపతి రమేశ్ పాల్గొన్నారు.

ఓడేడ్‌లో కాంగ్రెస్ పాదయాత్ర



ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: మండలంలోని ఓడేడ్‌లో బుధవారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ తీశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, నాయకులు మద్దెల రాజయ్య, దాసరి చంద్రమౌళి, బక్కతట్ల వినీత్, తీగల సత్యనారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

జూలపల్లి: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్, కొల్లూరి స్వామి, గంగారెడ్డి పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తా నుంచి ఇందిరానగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వారు. రోడ్డుపై గుంతలు గమనించక రాత్రివేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి. తవ్విన ప్రదేశంలో సదర్ గుత్తేదారు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఆర్జీ–1 ఏరియాలో క్వార్టర్ల కౌన్సెలింగ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని క్వార్టర్ల కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో సీఎంసీ, ఎస్‌సీ, బీసీహెచ్, డీ, టీ–2, ఎంబీ, ఎస్టీ–2 టైప్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హత గ్రేడ్ బట్టి క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, కార్మిక నాయకులు అరెల్లి పోషం, సీనియర్ పర్సనల్ అధికారి శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, పీవో దేవాచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెక్యూరిటీగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న ఏఎస్‌వో షబ్బీరుద్దీన్

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డు చంద రాంలక్ష్మణ్ కుటుంబానికి ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది బుధవారం ఆర్థిక చేయూత అందించారు. రాంలక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఎస్అండ్‌పీసీ సిబ్బంది 1.35లక్షలు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది రూ.23,600 మొత్తం కలిపి 1.58లక్షలు ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్ చేతుల మీదుగా బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ పోగుల స్వామి, ఎస్అండ్‌పీసీ సిబ్బంది రాజేందర్, సదానందం, సదయ్య, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న చందుపట్ల సునీల్‌రెడ్డి

కమాన్‌పూర్: గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి క్రియాశీల, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పీఎం నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొయ్యడ సతీశ్, మచ్చగిరి రాము, మట్ట శంకర్, జంగపెల్లి అజయ్, మల్లారపు అరుణ్, శేఖర్, శరత్, లక్ష్మణస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయల్ 100కు సమాచారం అందించండి



మాట్లాడుతున్న షీటీం సభ్యురాలు స్నేహలత

జ్యోతినగర్: ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు తక్షణ సాయం కోసం డయల్ 100కు సమాచారం అందించాలని రామగుండం కమిషనరేట్ షీటీం సభ్యురాలు స్నేహలత కోరారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని మహిళా స్వశక్తి సంఘం సభ్యులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రతీరోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తా, జన సమీకరణ ప్రాంతాలు, కాలేజీల వద్ద షీ టీం సభ్యులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలు ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని సూచించారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, సీవో శ్వేత, అధ్యక్షురాలు తిరుమల, ఆర్‌పీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి విజయవంతం చేయాలి

ఓదెల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు మాటూరి రత్నం కోరారు. ఓదెలలో బుధవారం ఆయన అంబేడ్కర్ జయంతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని కొలనూర్‌లో జరిగే జయంతి వేడుకల్లో ప్రజాస్వామ్యవాదులు, అధికారులు, విద్యార్థులు, కార్మికులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకులు సాత్తూరి అనిల్, పల్లె సుమన్, గోపాల్ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముతవల్లి అర్చక బృందం పండితులు హోమం చేసి, ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ పల్లకిలో శోభాయాత్ర ఊరేగించారు.

పాదయాత్రగా కొండగట్టుకు..

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో హనుమాన్ మాలధారణ స్వీకరించిన స్వాములు బుధవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. అర్ధమండలం దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు గ్రామంలోని ఆలయంలో పూజలు చేసి పాదయాత్రగా కొండగట్టుకు వెళ్లారు.